పరిశోధనా బుద్ధి

నేను స్నేహపాత్రుణ్ణి కానని ఎవరూ అనలేదు. నన్ను గురించి అటువంటి ముక్క ఎన్నడూ పుట్టనూ లేదు. ఇవాళ ఈ సుబ్రహ్మణ్యమూ ఈ నాగేశ్వరరావూ తమ కడుపుమంట కొద్దీ అన్నంతమాత్రం చేత నేను స్నేహపాత్రుణ్ణి కాకపోతానా ఏమిటి?

నాకు వీళ్ళిద్దరే స్నేహితులా? డజనుల కొద్దీ ఉన్నారే నా స్నేహితులు! ఎవరితోనూ రాని పేచీ నాకు వీళ్ళతోనే రావడమేలా? ఎవరికీ చెయ్యని అవమానం నేను వీరికే చెయ్యడమేమీ? బుద్ధి పొరపాటు తమదే అనుకోరాదూ?

"అబ్బాయి! నీ అభిరుచులూ నా అభిరుచులూ కలవవు. నీకు ఇడ్లీమీద శనగపచ్చడి ఇష్టం; నాకేమో చింతపండు పచ్చడి ఇష్టం. కనక మనిద్దరికీ స్నేహితం ఎక్కడ కుదురుతుంది?" అనే రకం మనిషిని కనకనా నేను?

నేను సుబ్రహ్మణ్యానికీ నాగేశ్వర్రావుకూ అవమానం చేసినమాట వాస్తవమే. ఒక్క అవమానం చెయ్యటమే కాదు, జరిగిన సంగతి నలుగురిలోనూ ప్రచారం కూడా చేశాను. చెయ్యగా లేనిది చెప్పటానికి నా కభ్యంతరం ఏమిటి? కాని వాళ్ళిద్దరిలోనూ ఉన్న రిసెర్చి స్పిరిటు నాకు దుర్భరమయ్యేదాకా నేనెంతో ఓర్పుతో సహించాను. వాళ్ళు కాదంటారా?

తమకున్న రిసెర్చి స్పిరిటు నాకు లేదని వాళ్ళిద్దరూ ఎరుగుదురు. నాలో ఏ స్నేహపాత్రత లేదని వాళ్ళిప్పుడు నన్ను వేలుపెట్టి చూపిస్తున్నారో, ఆ స్నేహ పాత్రత తమలో ఈషణ్మాత్రమైనా ఉండి ఉంటే, తమ రిసెర్చి స్పిరిటును నా ఎదురుగా ఉన్నంత సేపూ దిగమింగుకోవలసింది. ఆ పని చేశారా? ఒక్కనాటికి చెయ్యలేదు. నాకు దయ్యాలు మొదలైన వాటిల్లో నమ్మకం లేదన్నమాట సుబ్రహ్మణ్యం కానీ, తనకు వాట్సనుగిరి చెయ్యటానికి నా కభ్యంతరం ఉండి ఉండవచ్చుననే మాట నాగేశ్వర్రావుకానీ తమంతట తాము తెలుసుకో లేకపోగా, లౌక్యంగా నన్నడిగి తెలుసుకుందామని అయినా ప్రయత్నం చేశారా? ఎందుకు చేస్తారూ?

చిత్రం ఏమిటంటే ఈ సుబ్రహ్మణ్యమూ నాగేశ్వర్రావూ ఒకరినొకరు ఎరగరు. వాళ్ళిద్దరూ కూడబలుక్కుని నన్ను బాధించినట్టయితే నేను ఆశ్చర్యపడి ఉండను. విధి నాకా యిద్దరినీ చెరొక చేతితోనూ ప్రసాదించినందుకు నేను చాలా ఆశ్చర్యపడతాను.

నిజం పడితే ఇద్దరు కూడా నా స్నేహితులు కారు – స్నేహితుల స్నేహితులు; నాకు వాళ్ళద్వారా పరిచయులు మాత్రం అయినారు. మనుష్యులను కొలిచే సాధనం ఏదైనా ఉంటే ఇద్దర్నీ కలిపి కొలిచినా నాకు చాలరు. శరీరబలం చూస్తే నేను ఇద్దర్నీ "ఒక్క లంగోటా మీద" మడతపెట్టి తన్నగలను. తెలివి తేటలకయితే వాళ్ళిద్దరికీ అనేక విషయాలను గురించి నేను చాలాకాలం పాటు చదువు చెప్పగలను. ఏదో మర్యాదగా – రెండుచేతులూ, రెండు కాళ్ళూ, రెండు కళ్ళూ, రెండు చెవులూ మొదలైనవి కలిగిన తరవాత ఆ మనిషిని నిండు మనిషిగా భావించటం ధర్మం గదా అని! – తొమ్మిది వందల పౌనులవాడూ తొంభై పౌనుల వాడూ "మనిషి" అనే ఒక పదం చేతనే నిర్దేశించబడుతున్నారు గదా అని – నేను వాళ్ళను స్నేహభావంతో, నా సమానుల కింద గణించి, దగ్గిరికి తీస్తే ఒకడు (సుబ్రహ్మణ్యం) నన్ను పిల్లవాడి కింద కట్టేసి "ఏమీలేదోయ్! నీలో ఆ రిసెర్చి పుట్టిందంటే దయ్యమంటే భయపడటమూ అదీ పోయి నీకు ఆ దయ్యాల్లో అబ్జెక్టివ్ ఇంటరెస్టు కలుగుతుంది" అనీ; మరొకడు (నాగేశ్వర్రావు) "ఏమిటోయ్! నువ్వు పవర్స్ ఆఫ్ అబ్జర్వేషన్ లేక జీవితంలో ఎంత మిస్ అవుతున్నావో ఎరుగుదువా?" అనీ నన్ను తగులుతారా?

సుబ్రహ్మణ్యం నన్ను తనకింద అప్రెంటిస్‌గా ఉండమనీ, నాగేశ్వర్రావు తన షెర్లాక్ హోమ్స్ తనానికి నా వాట్సన్‌తనం సహాయం చేసి ఇన్‌స్పిరేషన్ ఇవ్వమనీ! ఇటువంటి "తొక్కుపల్కులు" వాళ్ళు పలుకుతుంటే విని ఆనందించటానికి వాళ్ళేం నా మునిమనవలా?

అయినా సహించాను! ఇద్దరికీ ఫేర్ ఛాన్స్ ఇచ్చాను. నా గదిలో ఒకసారి ఆరణాల డబ్బులు మాయమైతే, నాగేశ్వర్రావును అపరాధ పరిశోధన కానివ్వమని నియమించాను. ఒక గంటసేపు నన్ను వాగించి, షెర్లాక్ హోమ్స్ ఏమేమి చేసి ఉండేవాడో అదంతా నటించి, చివరకు ఆరణాలూ నేనే తీసి ఉండాలని కనిపెట్టాడు. ఫూల్!

సుబ్రహ్మణ్యాన్ని కూడా కొంతకాలం పాటు హ్యూమర్ చేస్తే వాడికే కళ్ళు తెరుపిళ్ళు పడకపోతవా అని, ఒక రాత్రి అతనితో దయ్యాల వేటకు బయలుదేరాను.

"దయ్యం కనపడగానే నేను చెబుతాను. అప్పుడు ఫోటో తీద్దాం!" అన్నాడు. "సరే" నన్నాను.

"రాత్రిపూట కనుక ఫ్లాష్ లైటు ఉపయోగించాలి. నీ కెమెరా తీసుకురావాలి. ఏం?"

దానికీ ఒప్పుకున్నాను. ఆ సాయంకాలం నాచేతనే కొనిపించాడు ఫ్లాష్. పౌడరు ఒక ప్లేటు లోడ్ చేయించాడు. ఫ్లాష్ ఎట్లా ఇస్తావని అడిగాను. పౌడరు ఒక రేకుమీద పెట్టి దయ్యం కనపడగానే కాలుస్తున్న సిగిరెట్టుతో అంటిస్తానన్నాడు. నా తప్పెంత వరకంటే – నేను వద్దనలేదు. తను సిగ్నల్ ఇవ్వగానే నేను కెమెరాను దయ్యంవైపు పెట్టి షట్టరు తెరచి ఉంచేటట్టు ఏర్పాటు అయింది.

రాత్రి తొమ్మిదింటికి సుబ్రహ్మణ్యం వచ్చి నన్ను కేకవేశాడు. ఇద్దరమూ కావలసిన పరికరాలతో బయలుదేరాం. పౌడరు వుంచిన రేకు అతను పట్టుకున్నాడు. మా ఇల్లు దాదాపు ఊరి చివర ఉండడం వల్ల నాలుగడుగులు వేసేటప్పటికి ఊరి బయటికి వచ్చాం. అమావాస్య చీకటి. మేం ఒకచోట నిలబడి చుట్టూ పరికించటం మొదలుపెట్టాం. ఒక పక్కగా మాకు యాభై అంగల్లో ఒక నల్లని ఆకారం కనపడ్డది. ఎవరో ఆడమనిషి అని స్పష్టంగా తెలుస్తున్నది.

"మనం ఎటుపోదాం?" అన్నాను.

"అదుగో! అది దయ్యమేనా?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

అవునందామనుకున్నాను. కాని అంత దౌర్జన్యం చెయ్యటానికి మనస్సు ఒప్పలేదు.

"కాదు. ఎవత్తో ఆడది."

"కాదు. దయ్యం! లేకపోతే అక్కడ ఎందుకు నుంచుందీ? మనల్ని చూసి అయినా కదలదేం?"

"లక్షకారణాలుంటై! ఎందుకు నుంచున్నదని అడుగుతావేం? అయినా, ఆ మనిషి జోలి మనకెందుకిప్పుడు?"

"అది దయ్యమేను, భాయి! రెడీకా! ఫోటో ఎత్తేసుకుందాం!"

అతను ముందూ నేను వెనకా, ఇద్దరమూ ఆ మనిషి వైపు నడిచాం. అదీ ఎవత్తో వింత మనిషే. మేం రెండుగజాల దూరంలోకి వచ్చేదాకా కదలక ఆ తరవాత ఒక్కటంటే ఒక్క అడుగు వెనక్కు వేసి నుంచుంది. సుబ్రహ్మణ్యం మరొక్క అడుగు ముందుకు వేశాడు – ఆ చేతులో రేకూ, నోట్లో సిగరెట్టూ, వాడూ!

ఆ మనిషి మరి ఏమనుకుందో ఏమిటో? "ఎందుకయ్యా అట్లా మీది మీది కొస్తావు?" అంది. ఇక ఆలస్యం చేస్తే దయ్యం అంతర్థితం అయిపోతుందని నిశ్చయించుకున్నాడేమో సుబ్రహ్మణ్యం, అర్థం లేకుండా "స్నాప్ కొట్టు! కొట్టు!' అని అరిచి, చేతులో ఉన్న రేకుమీద పౌడరు మీద కాలుస్తున్న సిగరెట్టు వేసి రుద్దాడు. పౌడరు భగ్గునమండి అతని చెయ్యంతా కాలింది. ఈ గలభాలో ఆ ఆడమనిషి "చంపుతున్నార్రరో!" అని కెవ్వున అరిచి దిక్కు తెలీకుండా పరిగెత్తి చీకట్లో మాయమయింది. దూరాన్నించి ఎవరో "ఎవడ్రావాడూ? పట్టుకో! పట్టుకో!" అని కేకలు పెడుతూ మావైపు పరుగెత్తుకుని వస్తున్నాడు. మేమిద్దరమూ ఎట్లా కొంప చేరుకున్నామో ఆ పరమాత్ముడికే ఎరుక!

ఇంత గల్లంతు జరిగిన తరువాత మనుష్యమాత్రుడెవడైనా ఆ విషయాన్ని కలలోనైనా స్మరించ గోరుతాడా? సుబ్రహ్మణ్యం మనుష్యమాత్రుడు కాదుమరి. చచ్చిచెడి కొంప చేరుకుంటే, నన్ను ఆదుర్దాగా "ఫోటో తీశావా?" అని అడగటమే కాక, తియ్యలేదని

నన్ను కోప్పడటమే కాక, వేం చూసింది దయ్యమనీ, అదీ చూసా్తూండగానే మాయమైపోయిందనీ – ఎవరితోనో కాదు, నాతో – వాదించటం మొదలుపెట్టాడు. "వీడు ఇక లాభంలేదు! వీడిది హోప్‌లెస్ కేసు!" అని అప్పుడే అనుకున్నాను.

ఆ మాట అనుకున్నంత మాత్రం చేత ఏమయింది? నన్ను వీళ్ళు వదిలేది ఎట్లా? వాళ్ళ జాడ్యం నయంకావటం ఎట్లాగనే ప్రశ్నకన్నా ఇది నాకు చాలా ముఖ్యమైన సమస్య. ఒకడుగాదు, నానెత్తిన ఇద్దరు పిచ్చివాళ్ళు! ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్న సామెతగా ఒక్క దెబ్బతో ఇద్దర్నీ వదలించుకునే ఉపాయం ఒకటి ఆలోచించాను.

ఒకనాడు వాళ్ళిదర్నీ టీకి మాయింటికి పిలిచి స్నేహితం కలిపాను. "వీరు డి. సుబ్రహ్మణ్యం గారు, ప్రస్తుతం సైకిక్ రిసెర్చి మీద ఉన్నారు! వీరు పి. నాగేశ్వరరావు గారు, క్రిమినాలజిలో ఆరి తేరినవారు!" బస్! ఇద్దరూ చేతులు కలుపుకున్నారు. ఆనాటినించీ ఇద్దరూ నా "టీ" తాగటానికి వస్తూ ఉండటమే కాక, నా దగ్గిర రిసెర్చి స్పిరిటు తక్కువగా ఉండటం ఆధారం చేసుకుని, నన్ను ఒక విధమైన అస్పృశ్యుణ్ణి చూసినట్టు చూస్తూ మాట్లాడుకుంటుండే వాళ్ళు.

ఈ విధంగా ఒక వారం గడవనిచ్చి మెల్లిగా ఇద్దరినీ ఒక్క పర్యాయం ముగ్గులోకి దించాను.

"ఇది మీరిద్దరూ జాగర్తగా వినవలిసిన విషయం! ఇక్కడికి మూడు మైళ్ళ దూరంలో, పాలెం వెళ్ళే దోవలో ఒక పాడుబడ్డ ఇల్లు ఉంది. మీ ఇద్దరూ చూశారా? సరే! ఒకనాడు అటుకేసి షికారు వెళదాం. ఇల్లు చూపిస్తాను. అది దయ్యాలకొంప!"

"ఏమిటి?" అన్నాడు సుబ్రహ్మణ్యం ఆశ్చర్యంతో.

"అందులో సంవత్సరం కింద ఒక హత్య జరిగింది."

"హలో!" అంటూ, నాగేశ్వరరావు ఇకిలిస్తూ చేతులు రుద్దుకున్నాడు. (ఇటువంటి దురభ్యాసం షెర్లాక్ హోమ్స్‌కు ఉండేదిట?)

"ఆఁ! మరి! ఆ ఇంటి యజమానిని హత్య చేశారు. వరండాలో పడుకుని నిద్రపోతుంటే గుండెల్లో పలుగు దిగవేశారు. ఎవరు హత్య చేశారో నిర్ధారణ కాలేదు. తత్సందర్భంలో నలుగురైదుగుర్ని ఎరెస్టు చేసినా, ఎవరిమీదా కేసు నిలవక పోయింది. ఆయన దయ్యమైనాడని అంతా అంటున్నారు మరి. మీ ఇద్దరికీ ఇది చాలా కుతూహలం ఉండవలసిన విషయం మాత్రం అవును. ఏమంటారు?"

నాగేశ్వరరావు ఉత్సాహం తగ్గిపోయింది.

"అబ్బే! సంవత్సరం క్రితం జరిగిన హత్య మనం ఇప్పుడు చహరా తియ్యగలమా? నేను గార్ధభం మాదిరిగా సంతోషిస్తున్నాను!"

"నీ పట్టుదలతో నీవు చెయ్యకపోతే ఇక ఎవడు చేస్తాడో నాకు బోధ పడకుండా ఉంది. చచ్చిపోయినవాడు మంచి స్థితిపరుడు. ఆయన భార్యా సోదరుడు ఎస్టేటు మేనేజిమెంటు చేజిక్కించుకుందామనే దుర్బుద్ధితో ఈ హత్య చేశాడని అందరికీ తెలుసు. అతను ఇప్పుడు ఆ పనిమీదే ఉన్నాడు కూడానూ! కాకపోతే కొంత డబ్బు తగలబెట్టి కేసు అయితే తప్పించుకున్నాడు. నువ్వు చెయ్యవలసిందేమిటంటే, స్వయంగా వెళ్ళి కొంత శోధన చేసి, డేటా సంపాదించి, అతగాడి మీద కేసు రుజువు చెయ్యటమే! అది ఎట్లా సాధ్యమవునా అని నువ్వు అనుమానించకు. హత్య జరిగిన నాటినించీ ఆ కొంప ఆ విధంగా పాడుబడి ఉంది. నీవంటి పరిశోధకుడికి ఎంత విలువయిన డేటా దొరికినా ఆశ్చర్యం లేదు."

"డిటెక్టివు" మెత్తబడ్డాడు. సుబ్రహ్మణ్యం అదివరకే జావ అయినాడు. కనక అతనికి ఉపన్యాసం అవసరం లేకపోయింది. అదిగాక దయ్యాలు, కొన్ని కొన్ని ఊరగాయల మాదిరిగా, పాతబడి మాగిన కొద్దీ అన్వేషణా పరులకు బాగా రుచించుతవి.

ఒకనాడు సాయంకాలం వాళ్ళను ఆ పాడుబడ్డ కొంపవైపు షికారు తీసుకు వెళ్ళి చూపించాను. ఇంకా ఇతర ఏర్పాటులన్నీ చేసి మా శోధనా ప్రయత్నాలకు ముహూర్తం పెట్టించాను.

బొత్తిగా చీకటిరాత్రి కంటె గుడ్డి వెన్నెలలో అయితే బాగా ఉంటుందని తోచింది నాకు. ఆ ప్రకారమే ఒంటి గంట వేళకు గుడ్డివెన్నెల ఉండే రాత్రిగా చూసి ఇద్దరినీ బయలుదేర తీశాను. మేము బయలుదేరే సరికి పది దాటింది. మూడుమైళ్ళూ ఒక గంటసేపటిలో నడిచి పాడుబడ్డ కొంపకు చేరుకున్నాం.

ఆ ఇల్లు చేలమధ్య ఉంది. దాని ఆవరణ యావత్తూ అయిదువందల చదరపు గజాలుంటుంది. ఇంటికి ఒకవేపున పెద్ద దొడ్డి ఉంది. ఈ దొడ్డిలో చెప్పుకోదగిన చెట్లు ఒకటీ లేకపోయినా, ఏవో పిచ్చి మొక్కలూ గడ్డీ తెగ పెరిగి ఉండటం వల్ల కాలు పెట్టటానికి కంపరంగా ఉండి, ఇదిన్నీ ఒక విధమైన అరణ్యమే అనిపిస్తున్నది. పైగా చీకటి. ఎక్కడా జనసంచారం లేదు. కనుచూపు మేరలో ఒకటే కీచురాళ్ళ రొద. ఇల్లు బిక్కు బిక్కుమంటూ "నన్నేం చేసినా సరే" అన్నట్టు ఉన్నది.

ఈ కొంపకు తూర్పువైపున పంచ ఉంది. ఆ పంచలో ముగ్గురమూ చేరాం. మొదటి గంటల్లా నా అనుచరులిద్దరూ వసపోసిన పిట్టలల్లే వాగారు. కాని క్రమేణా వాళ్ళకు మితభాషిత్వం వచ్చింది.

పన్నెండు గంటలయింది. చంద్రోదయం అయింది. అప్పటికి అరగంట నించీ ఎవ్వరమూ నోరువిప్పలేదు.

"ఏమిటి శవజాగారం? నాకు దయ్యాల్లో నమ్మకం లేదు. మనం లాంతరు గాని

"టార్చి" గాని తీసుకురావటం మరిచాం. నేను నిప్పుపుల్లలు వెలిగించి అయినా ఇల్లు పరీక్ష చేస్తాను!" అన్నాడు నాగేశ్వర్రావు విసుగుకుంటూ.

"తొందర పడకోయి ! నిదానించు మరి!" అన్నాను.

"ఏమిటా చప్పుడు!" అన్నాడు సుబ్రహ్మణ్యం. మాట తడబడుతూ. యింట్లో ఏదో అలికిడి అయింది. ఒక్క సుబ్రహ్మణ్యమేకాక నేను నాగేశ్వర్రావు కూడా విన్నామా అలికిడి. పరీక్షపెట్టి ఆ గుడ్డి వెన్నెలలో నాగేశ్వర్రావు మొహం చూశాను – పాలిపోయింది భయంతో.

"నాకు దయ్యాల్లో నమ్మకం లేదు. భయమూ లేదు!" అన్నాడతను బింకంగా.

"నాకు నమ్మకం ఉంది కాని భయం లేదు!" అన్నాడు సుబ్రహ్మణ్యం వణుకుతూ.

"నాకు నమ్మకం లేదు గాని భయం ఉంది" అన్నాను నిశ్చింతగా.

"ఏమిటా చప్పుడు" అన్నాడు నాగేశ్వర్రావు.

ఈసారి లోపల ఎవరో నడుస్తున్నట్టు స్పష్టమయింది.

"ఆవెల్తురెక్కడిది?" అన్నాడు సుబ్రహ్మణ్యం నెత్తిమీద చూరువంక చూస్తూ. అతని మాటలు తడబడినై. ఇద్దరి పసా అయిపోయిందని కనుక్కున్నాను. వీళ్ళను ఈ విధంగా అయిదునిమిషాల కాలం ఆదుర్దాలో పెడితే ఇద్దరికీ పిచ్చి ఎత్తటం తథ్యం.

"లోపల ఎవరో ఉన్నట్టున్నార్రా! తలుపు తట్టి కనుక్కుందాం!" అంటూ లేచి వెళ్ళి గట్టిగా తలుపుతట్టాను. కొద్దిసేపటికి తలుపు తెరుచుకుంది. వాకిట్లో ఒక పొట్టి నల్లటి ఆకారం కనపడ్డది.

"మీరెందు కొచ్చారో తెలుసు నాకు. రండి లోపలికి!" అన్నాడు తలుపు తెరిచిన మనిషి హీనస్వరంతో. ముగ్గురమూ లోపలికి అడుగుపెట్టాం. మాకు ముందు నడుస్తూ గృహస్తు మమ్మల్ని లోపలికి తీసుకువెళ్ళాడు. ఆయన చూడటానికి సంసారి మాదిరిగా కనపడ్డాడు. నీరుకావి బట్టకట్టుకున్నాడు. పైన ఏమీ వేసుకోలేదు. గడ్డం మాసి ఉంది. ఆయన మాట శూద్రమాటే!

ఈపాటికి మా స్నేహితుల భయాలు తీరినై.

"మిమ్మల్ని ఇక్కడ ఎక్కువసేపు ఉండనివ్వను... ఆ చాపమీద కూచ్చోండి!... మీకు కావలసిందంతా ముచ్చి మూడుముక్కల్లో చెప్పి పంపిస్తాను... మీరు నిలబడి ఉన్నారేం! మీరు కూడా కూచోండి! (ఇది నాగేశ్వర్రావుకు)... నేను బాగా కలవాణ్ణి. కాని ఒక కారణం వల్ల మనుష్య ప్రపంచంతో సంబంధం లేకుండా ఉంటున్నా. నేను మనిషికంట పడటం మానేశాను. అనేక రోజుల్నించీ నాకు అతిథులెవరూ లేరు. రాక రాక మీరొచ్చారని కనపడ్డా.

నేనిప్పుడు పగబట్టి ఉన్నా.

అదెట్లా వచ్చిందంటే?... మొదట నేను వాడెంత అడిగితే అంత డబ్బు ఇచ్చా.

అది తగలేసి తాగి ఇంకా కావాలని రాసాగించాడు. వాడికి ముందూ వెనకా తెలీదు కోపం వస్తే! అందుకని, వాడిబుద్ధి ఎట్లా మార్చటమో నాకు తోచక పోయింది. కొంచెం గట్టిగా చెప్పితే కోపం వస్తుందని భయం కాదు! అందుకని వాడి చెల్లెలి చేత చెప్పించా! ఆ రాత్రిరే వాడు పలుగు పట్టుకొచ్చి నేను మంచంలో పడుకుంటే గుండెల్లో దిగేశాడు. అప్పుడు నేను లెగిసి..."

ఈ కథ చెప్పుతున్న కొద్దీ మొదట హీనంగా ఉన్న ఆసామీగొంతు అంతకంతకూ హెచ్చటం మొదలుపెట్టి చివరకు కేకల కింద మారింది. కథ ఈ ఘట్టానికి వచ్చేటప్పటికి నా స్నేహితులిద్దరూ కెవ్వున అరిచి పారిపోయినారు. నేనూ మావేషగాడూ బయటికి వచ్చి చూసేసరికి అప్పుడే వాళ్ళు చాలాదూరం వెళ్ళారు.

"బాగానే ఉంది, రాఘవయ్యా, నీ ప్రదర్శనం. ఇక ఈ ఇద్దరూ నన్ను వేధించరని తలుస్తాను! మనం ఈ రాత్రికి ఇక్కడ కాలక్షేపం చేతామా" అన్నాను..

ఇదీ నేను చేసిన అపరాధం. రాఘవయ్య వాళ్ళకు మర్నాడు కనపడటానికి కారణం నేనే. లేకపోతే వాళ్ళకు నేను చేసిన అవమానం తెలిసిరావడం ఎట్లా? రాఘవయ్య మా ఊరివాడు మరి. రాఘవయ్యను నేను బయట పెట్టదలచి ఉండననీ, తమ తెలివితేటల వల్ల నా దుర్మార్గం బయట పడ్డదనీ ఆ మూఢుల నమ్మకం. కానివ్వండి! వాళ్ళేమనుకుంటే మటుకు నాకేం? మీకేం?

మొదటి ముద్రణ : వినోదిని, అక్టోబర్ 1935